పీఏసీ చాంబర్‌లో పూజలు చేసిన ఎమ్మెల్యే గాంధీ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలోని తన చాంబర్‌లో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లేజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ నర్సింహచార్యులు, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం


ప్రథమ ఆయుర్వేద చికిత్స పంచకర్మ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న యాంకర్ సుమ

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం చాలా పురాతనమైందని, ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యాంకర్ సుమ అన్నారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రథమ ఆయుర్వేద చికిత్స పంచకర్మ హాస్పిటల్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. కేరళకే పరిమితమైన ఆయుర్వేద చికిత్సలను తెలుగు రాష్ట్రాల ప్రజలకు పరిచయం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. నిర్వాహకురాలు డాక్టర్ బీసెట్టి శాంతి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణలో ఆటిజం, ఏడీహెచ్‌డీ కోసం చిన్నపిల్లలకు పంచకర్మ చికిత్సలు అందించే ఏకైక హాస్పిటల్ తమదేనని అన్నారు.

బీజేపీ కార్యాలయానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం సాయంత్రం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు,గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి వచ్చిన మల్లారెడ్డి, మనుమరాలు వివాహ ఆహ్వాన పత్రికను కిషన్‌రెడ్డికి అందజేశారు.


బతుకమ్మ వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌రావు కుటుంబ సభ్యులు


భారీ బతుకమ్మతో కుర్మయ్యగారి కొండల్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులు


బతుకమ్మ వద్ద కూకట్‌పల్లి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు కుటుంబ సభ్యులు


కేపీహెచ్‌బీ సర్దార్‌పటేల్ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

ఒక్కేసి.. పువ్వేసి చందమామ..

రంగురంగుల పువ్వులతో అందంగా అలంకరించిన బతుకమ్మలను మహిళలు, యువతులు, చిన్నారులు ఒకదగ్గర చేర్చి.. ఒక్కేసి.. పువ్వేసి చందమామ.. రెండు జాములయే చందమామ.. అంటూ పాటలు పాడుతూ.. బతుకమ్మ, దాండియా ఆడుతూ సందడి చేశారు. గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆయా ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

-శేరిలింగంపల్లి/కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి)


శంభీపూర్ గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కూకట్‌పల్లిలోని వెంకట్‌రావునగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాహనాల్లో బతుకమ్మలను ఊరేగిస్తున్న దృశ్యం


పూలతో అందంగా తయారు చేసిన బతుకమ్మ వద్ద కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మనమరాలు ఐరా


బతుకమ్మతో వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి


పట్వారి శశిధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ పూజిత


బాచుపల్లి గ్రామంలో భారీ సంఖ్యలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


గచ్చిబౌలి టీఎన్‌జీఓ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కేపీహెచ్‌బీ కాలనీ శ్రీలా పార్క్ ప్రైడ్‌రైడ్‌లో బతుకమ్మ వేడుకలో మహిళలు


సూరారం డివిజన్ మార్కండేయ నగర్‌లోని దుర్గాదేవి మండపంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ సత్యనారాయణ, సోమేష్‌యాదవ్, కాలనీవాసులు

రూ.229 కోట్ల భారీ మోసం

- అత్యధిక లాభాలంటూ డీకేజెడ్ టెక్నాలజీస్ బురిడీ
- 17,500 మందిని దగా చేసిన కేటుగాళ్లు
- యూట్యూబ్ వీడియోలకు ఆకర్షితులై.. కోట్లు పెట్టుబడులు పెట్టిన బాధితులు
- డైరెక్టర్, ప్రొప్రయిటర్ అరెస్టు



హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): 'లక్ష పెట్టుబడి పెడితే బేసిక్ స్కీమ్ కింద 15 శాతం ప్రాఫిట్‌తో మూడు నెలల్లో రూ. 1.15 లక్షలు, ఆరు నెలల్లో గోల్డెన్ స్కీమ్ కింద రూ. 1.25 లక్షలు, 12 నెలలకు ప్లాటినం స్కీమ్ కింద 60 శాతం ప్రాఫిట్‌తో రూ. 1.60 లక్షలు, 24 నెలలకు ఆర్బిట్ స్కీమ్ కింద 100 శాతం ప్రాఫిట్‌తో రెట్టింపు డబ్బులు అంటే 2 లక్షలు అందిస్తాం' అంటూ బురిడీ కొట్టించారు డీకేజెడ్ టెక్నాలజీస్ నిర్వాహకులు. సుమారు 17,500 మందిని మోసం చేసి రూ.229 కోట్లు కొల్లగొట్టి భారీ ఆర్థిక మోసానికి పాల్పడిన కేటుగాళ్ల ఆటకట్టించారు సిటీ సీసీఎస్ పోలీసులు. సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వక్ రహీల్ డైరెక్టర్‌గా, ఆయన భార్య సయీదా అయేశానాజ్ ప్రొప్రయిటర్‌గా మాదాపూర్‌లో డీకేజెడ్ టెక్నాలజీస్/డికాజో సొల్యూషన్స్ ప్రై. లిమిటెడ్ పేరుతో సంస్థను ప్రారంభించారు. మాదాపూర్‌లో డికాజో, చాదర్‌ఘాట్‌లో అర్లీ ఫ్రెష్ స్టోర్ ఉన్నాయని, హెడ్ సెట్స్, నెక్‌బ్యాండ్ కంపెనీ బోల్ట్, అమెజాన్‌తో ఒప్పందాలు చేసుకున్నామని నమ్మించారు. బిటుబి (బిజినెస్ టు బిజినెస్), బీ టు సి (బిజినెస్ టు కస్టమర్) వ్యాపారానికి అవకాశం ఉందన్నారు. అమెజాన్ నుంచి రోజుకు 4000 ఆర్డర్స్ వస్తాయని ప్రచారం చేసుకున్నారు. ప్రత్యేక ఏజెంట్లను నియమించుకోవడంతో పాటు, సోషల్‌మీడియా, యూట్యూబ్‌లలో భారీగా ప్రచారం చేశారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే ప్రారంభంలోనే 8 నుంచి 12 శాతం ప్రాఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. యూట్యూబ్‌లో ప్రచార వీడియోలకు ఆకర్షితులైన కొందరు మాదాపూర్‌లోని కార్యాలయానికి వచ్చి విచారించేవారు. సంస్థ మేనేజర్లు మహ్మద్ ఇక్బాల్, సయ్యద్ ఉమర్ అహ్మద్, నజీర్, బిలాల్ పెట్టుబడుల గురించి, ప్రాఫిట్స్ గురించి, సంస్థ ప్రవేశపెట్టిన బేసిక్, గోల్డెన్, ప్లాటినం, ఆర్బిట్ స్కీముల గురించి వివరించేవారు. వాటికి సంబంధించిన బ్రోచర్లను ఇచ్చేవారు. రూ.5000 నుంచి పెట్టుబడులు పెట్టవచ్చని సూచించారు. వారి మాటలను నమ్మిన కస్టమర్లు రూ. కోట్లలో పెట్టుబడులు పెట్టారు.

వెలుగులోకి వచ్చిందిలా..

గుడిమల్కాపూర్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ జైష్ ఈ ఏడాది జనవరిలో డీకేజెడ్ టెక్నాలజీస్/డికాజో సొల్యూషన్స్‌కు సంబంధించిన ఇన్వెస్టిమెంట్ ప్లాన్స్ వీడియోను యూట్యూబ్‌లో చూశాడు. ఆ స్కీమ్‌లకు ఆకర్షితుడైన జైష్.. మాదాపూర్‌లోని సంస్థ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడి వారితో మాట్లాడడంతో పాటు కార్యాలయం హంగూ ఆర్భాటాన్ని, కార్పొరేట్ హంగామాను చూసి ముగ్ధుడై కొంత పెట్టుబడి పెట్టాడు. రిటర్న్స్ రావడంతో కొద్దినెలలు గడిచిన తర్వాత మరోసారి కార్యాలయానికి వెళ్లి తన వాటాగా రూ.2.74 కోట్లు పెట్టుబడులు పెట్టారు. సంస్థ నుంచి రిటర్న్లు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సీసీఎస్ పోలీసులు కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 564 ఒరిజినల్ ప్రొక్యూర్‌మెంట్ గ్యారెంటీ అగ్రిమెంట్ బాండ్లు, డీకేజెడ్ టెక్నాలజీస్ లోగోతో కూడిన 5 బండిళ్ల లెటర్ హెడ్స్, వివిధ ఖాతాదారుల పేరుతో ఉన్న చెక్ బుక్స్, 13 ల్యాప్‌టాప్‌లు, రూ.1.70కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఇచ్చిన వాంగ్మూలం, డీకేజెడ్ టెక్నాలజీస్ రికార్డుల పరిశీలన అనంతరం మొత్తం 17,500 మంది నుంచి అక్రమంగా రూ.229 కోట్ల పెట్టుబడులు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్థిక మోసంతో పాటు, తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేశారు. సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలతో సీసీఎస్ డీసీపీ శ్వేత పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగింది. టెక్నికల్ ఎవిడెన్స్‌తో డైరెక్టర్, ప్రొప్రయిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతర మేనేజర్స్, ఏజెంట్లు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారినీ అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

బ్యాక్‌డోర్ పేరుతో మరో వంచన

- ఐటీ కారిడార్‌లో బోర్డు తిప్పేసిన మరో సంస్థ
- 500 మంది నుంచి డబ్బులు వసూలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బ్యాక్‌డోర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన మరో ఐటీ సంస్థ బోర్డు తిప్పేసింది. మాదాపూర్ కావూరిహిల్స్‌లోని వీవీ చాంబర్స్ నాలుగో అంతస్తులో 'సినర్జీ యూనివర్సల్' పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. బ్యాక్‌డోర్‌లో ఉద్యోగాలంటూ నిరుద్యోగులను నమ్మించిన యాజమాన్యం సుమారు 500 మంది నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసింది. డబ్బులు కట్టిన వారికి ఆఫర్ లెటర్లు ఇచ్చి, వర్క్‌ఫ్రం హోం అంటూ ఇంటికి పంపారు. ఆఫర్ లెటర్ ఇచ్చినా జీతాలు ఇవ్వకుండా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కొద్దిరోజులుగా కంపెనీ ప్రతినిధులు కార్యాలయానికి రాకపోవడంతో బాధితులు మోసపోయామని గ్రహించి మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. మోసం రూ.15 కోట్ల మేర ఉండడంతో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

డీసీఎం ఢీకొని యువకుడి మృతి

జీడిమెట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. గుండ్లపోచంపల్లికి చెందిన మీసాల ధనుంజయుడు(19), అతని స్నేహితుడు శ్రీరాములు కలిసి బైక్‌పై బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో గుండ్లపోచంపల్లి శ్మశానవాటిక వైపు వెళ్తున్నారు. వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టడంతో వీరు కిందపడ్డారు. ధనుంజయుని తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీరాములుకు తీవ్రగాయాలయ్యాయి. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు

గచ్చిబౌలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి, మియాపూర్, హైదర్‌నగర్‌లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, పార్టీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, నాయకులు నవీన్‌గౌడ్, అరుణ్‌కుమార్, నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నక్సల్స్ పేరుతో రైల్వే కాంట్రాక్టర్‌కు బెదిరింపులు

నలుగురి అరెస్టు, ఆరు ఫోన్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న ఆశతో నక్సలైట్లమంటూ రైల్వే కాంట్రాక్టర్‌ను బెదిరించిన నలుగురు వ్యక్తులను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ప్రసాద్ అలియాస్ ప్రదీప్ రెండేళ్లపాటు రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేశాడు. ఆ తర్వాత గుప్తనిధుల కోసం వేట ప్రారంభించి పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరిపాడు. ఆ సమయంలో అతనికి మియాపూర్‌కు చెందిన రత్‌లావత్ రవినాయక్, షాబాద్‌కు చెందిన సత్తయ్య, కమ్మరి శేషప్ప అలియాస్ రాజుతో పరిచయం ఏర్పడింది. గుప్తనిధుల కోసం ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు అధికమవ్వడంతో ఏదోవిధంగా రూ.కోట్లలో డబ్బులు కొల్లగొట్టాలని పథకం వేశాడు. గతంలో తాను పనిచేసిన రైల్వే కాంట్రాక్టర్‌కు నక్సలైట్లమని ఫోన్ చేసి రూ.5 కోట్లు ఇవ్వాలని, లేకుంటే అంతం చేస్తామని బెదిరించాడు. అనుమానం వచ్చిన కాంట్రాక్టర్ ఉస్మానియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పక్కా నిఘాతో మాటువేసి నలుగురు నకిలీ నక్సలైట్లను అరెస్టు చేశారు.

వైభవంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు

దేవీశరన్నవరాత్రి వేడుకలు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాలు, మండపాల్లో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- శేరిలింగంపల్లి/కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి)


హైదర్‌నగర్ సెవెన్‌హిల్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు


ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్-2 లాస్ట్‌బస్‌స్టాప్ వైభవాణీ యూత్ ఏర్పాటు చేసిన మండపంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు


కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న చండీహోమం